క్లుప్తంగా

ఉత్సాహంగా 'పై' డే


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు

వర్గల్(గజ్వేల్): దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వర్గల్ పూలే మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా 'పై' డే నిర్వహించారు. 'పై' గుర్తు ప్రత్యేకత, గణితంలో దాని ప్రాముఖ్యం గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు విద్యార్థులకు వివరించారు. గణితంలో అంకెలు, గుర్తులకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. గణితాంశంతో కూడిన 'ట్రెజర్ హంట్' గేమ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు, ఏటీపీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అన్నారు. గుడికందుల గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికందుల మీదుగా వర్దరాజుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ భైరాగౌడ్, నాయకులు ప్రకాశ్, సంతోష్, వెంకట్, రాములు, ఎల్లం పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కమ్మర్లపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఎంఈఓ యాదవరెడ్డి, హెచ్‌ఎం నర్సింహాచారి, ఉపాధ్యాయులు రామకృష్ణ, రేణుక, దీప్తి, మమత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ స్వప్న, మాజీ సర్పంచ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

వైభవంగా రుద్ర చండీయాగం


యాగంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక ఉమా పార్థీశ్వర కోటిలింగాల ఆలయంలో శుక్రవారం అర్చకులు రుద్ర చండీయాగం వైభవంగా నిర్వహించారు. కాముని పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యమా?

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గజ్వేల్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. నాయకులు శ్రీనివాస్, రాజమౌళి, జకీయొద్దీన్, నవాజ్‌మీరా, మధు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భీమ్ దీక్ష

బెజ్జంకి(సిద్దిపేట): స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో శనివారం నుంచి నిర్వహించనున్న భీమ్ దీక్షను విజయవంతం చేయాలని స్వేరోస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి సురేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని ప్రారంభించే ఈ దీక్ష ఏప్రిల్ 14వ తేదీ అంబేడ్కర్ జయంతి వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి స్వేరోస్ వ్యవస్థాపకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.


హోలీ వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రజిత


కొండపాక(గజ్వేల్): చిన్నారులతో మహాదేవ్‌గౌడ్ తదితరులు


కొమురవెల్లిలో..


సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో చిన్నారుల సందడి

హోలీ రంగుల కేళీ


గజ్వేల్‌లో జరిగిన సంబురాల్లో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దతేడా లేకుండా అంతా శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికొకకు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. యువత రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టారు. గురువారం రాత్రి కాముని దహనం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, యువకులు నృత్యాలు చేసి సందడి చేశారు. వివిధ పార్టీల నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.


గజ్వేల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తదితరులు


వర్గల్‌లో గ్రామస్తుల సందడి


దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో..


తొగుట మండలం వెంకట్రావుపేటలో..


మిరుదొడ్డిలో హోలీ ఆడుతున్న యువకులు


నంగునూరులో వేడుకలు జరుపుకొంటున్న యువకులు


హుస్నాబాద్‌రూరల్: వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ భూక్య మంగ


కోహెడరూరల్(హుస్నాబాద్): యువకుల వేడుకలు


చిన్నకోడూరులో..

ఘనంగా ఆనందయ్య జాతర

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలోని సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం హోలీ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఆనందయ్య జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లింగాభిషేకం అన్నపూజ, రథోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ ప్రాంతాలలో స్థిరపడిన ఆనందయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జాతరలో భజన చేస్తున్న భక్తులు

మహాత్ములు చూపిన మార్గంలో నడవాలి

బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్

జహీరాబాద్ టౌన్: మహాత్ములు చూపిన మార్గంలో నడుచుకోవాలని బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ సూచించారు. ప్రథమ మహిళా జగద్గురు స్వర్గీయ మాతే మహాదేవి 79వ జయంతి వేడుకలను పట్టణంలోని బసవ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ పాటిల్ మాట్లాడుతూ.. జగద్గురు మాతే మహాదేవి మాతాజీ జననం, మరణం ఒకే రోజు కావడం విశేషమన్నారు. లింగాయత్‌ల అభ్యున్నతికి ఆమె ఎంతో కృషి చేశారని, ఆమె అడుగుజాడల్లో నడవాలని సూచించారు.


మాతే మహాదేవి చిత్రపటానికి పూజలు చేస్తున్న బసవదళ్ నాయకులు

కార్యక్రమంలో జహీరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప, అక్కనబళగ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీశైలక్షేత్రానికి చేరుకున్న మహాపాదయాత్ర


శ్రీశైలానికి చేరుకున్న శివాచార్యులు ఆయన భక్తులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి పీఠాధిపతి శ్రీ వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం శ్రీశైలక్షేత్రానికి విజయవంతంగా చేరుకుంది. ప్రతీ సంవత్సరం శివాచార్యులు తన భక్తులతో కలసి మహాశివరాత్రి తర్వాత మహా పాదయాత్ర చేపడతారు. ఈ ఏడాది సుమారు 800 మంది భక్తులతో కలసి పదిరోజుల క్రితం మహా పాదయాత్ర ప్రారంభించారు. 380 కిలో మీటర్ల వరకు కొనసాగిన మహా పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. పాదయాత్రలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారని చెప్పారు. పాదయాత్రలో మామిడ్గి మల్‌శెట్టి, ధనసరి మాజీ సర్పంచ్ హబ్సి రాజు,సంగారెడ్డి తదితరులు ఉన్నారు.

జహీరాబాద్ చేరుకున్న పల్లకీ సేవ


మాట్లాడుతున్న సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

జహీరాబాద్: బెల్లాపూర్ ఈనెల పదో తేదీన నుంచి ప్రారంభమైన దత్తాత్రేయ స్వామి వారి పల్లకీ సేవ పాదయాత్ర శుక్రవారం రాత్రి జహీరాబాద్‌లోని కైలాసగిరి ఆలయానికి చేరుకుంది. దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, పలువురు భక్తులు వారికి స్వాగతం పలికారు. ఉదయం గంగ్వార్, మిర్జాపూర్(బి), కొత్తూర్(బి) గ్రామాల మీదుగా యాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లో భక్తులు పల్లకీ సేవ పాదయాత్రకు ఘనంగా స్వాగతంపలికి పూజలు చేసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ఆలయాలు ప్రశాంత నిలయాలుగా ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించుకునేందుకునే బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల పీఠాధిపతులు, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం


భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో గల ధ్యాన నిష్ఠాశమంలో హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పరిశుద్ధానందగిరి స్వామి, దయానందగిరి భక్త బృందం సభ్యులు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, రాజిరెడ్డి, రాజారాం, విజయ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట, దుబ్బాక డిపోల పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిద్దిపేట డీఎం సుఖేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు, సలహాల ఉంటే శనివారం మధ్యాహ్నం 11 గంటల నుంచి 12 మధ్య 99592 26271 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మాజీమంత్రి హరీశ్‌ను కలిసిన బీఆర్‌ఎస్ శ్రేణులు

పటాన్‌చెరుటౌన్: మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హోలీ పండుగ నేపథ్యంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం మాజీమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

హోలీ ఐక్యతను పెంచుతుంది

పటాన్‌చెరుటౌన్: హోలీ మనుషుల మధ్య ఐక్యతను ఆనందాన్ని పెంచుతుందని గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధితోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. పటాన్‌చెరు శివారులోని వాగర్స్ అసోసియేషన్ సభ్యులతో ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ హోలీ సంబరాలలో పాల్గొన్నారు. అదేవిధంగా కాలనీలు, ప్రధాన రహదారులో స్థానికులు ఉత్సాహంగా సంబురాలు జరుపుకొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామ సమీపంలో నాందేడ్- అకోలా జాతీయ రహదారి పక్కనే ఉన్న మర్రి చెట్టు విరిగిపడి రోడ్డుపై అడ్డంగా పడింది. శుక్రవారం ఉదయం పడిన చెట్టును సాయంత్రం వరకు అధికారులు తొలిగించక పోవడంతో వాహనదారులు రోడ్డు కింది నుంచి వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రహదారి పక్కనే ఉన్న ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో అది చెట్టుకు అంటుకుని సగానికి పైగా చెట్టు తగలబడి విరిగినట్లు తెలిస్తోంది. అధికారులు వెంటనే రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా ఉంటాం


చెక్కును అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

దుబ్బాక: కష్టాల్లో ఉన్న ఉపాధ్యాయుల కుటుంబాలను పీఆర్టీయూ సంక్షేమ నిధి ద్వారా ఆదుకుంటామని వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన దుంపలపల్లిలోని జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్ కుటుంబానికి శుక్రవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరణిస్తే వెంటనే సంక్షేమనిధి నుంచి లక్ష రూపాయలు అందజేస్తామన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ, నాయకులు పల్లె శ్రీనివాస్‌గౌడ్, మద్దుల లక్ష్మారెడ్డి, రాంచంద్రారెడ్డి, ఎంఈఓ ప్రభుదాసు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు


ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

దుబ్బాక: తెలంగాణ తొలి సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌పై కనీస గౌరవం లేకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, మల్లేశంగౌడ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ

- 31 నాటికి పూర్తిచేయాలని లక్ష్యం
- నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు

కంది(సంగారెడ్డి): మండలంలో ఆస్తి పన్నుల వసూలును అధికారులు వేగవంతం చేశారు. గ్రామాల అభివృద్ధికి ఆదాయ వనరులుగా ఉన్న పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. 2024, 2025 ఆర్థిక సంవత్సరం ముగింపునకు చేరుతుండటంతో ఈ యేడాది పన్నుల వసూలు ఈ నెల 31వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. అందుకోసం ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి నిరంతరం పన్నుల వసూలుపై దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉన్న వారికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఈ యేడాది 3.92 కోట్ల రూపాయలు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 3.30 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు ఎంపీఓ మహేందర్ రెడ్డి తెలిపారు. మిగతావి ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు.


చెర్లగూడెంలో ఆస్తి పన్ను వసూలును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం ఆగదు

మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నేత

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ అన్నారు. మూడో రోజుకు చేరుకున్న ఎమ్మార్పీఎస్ దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం చేసేంత వరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. మాదిగల పోరాటం నిరుద్యోగులకు వ్యతిరేకం కాదని, ఉద్యోగాల భర్తీలో అన్ని కులాలకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లాస్ మాదిగ, నిర్మల్, ప్రభాకర్ శ్రీనివాస్, జైరాజ్, రాంచందర్, సుకుమార్, కిట్టు, ప్రశాంత్, ధన్‌రాజ్, రాకేశ్, అఖిల్, సందీప్, సతీశ్, సమృద్ధి, పవన్, అజయ్, ఏసురత్నం పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు